# మహమ్మారి

రోజూ మార్నింగ్ వాక్‌కి బయలు దేరుతాను. రూములోంచి బైటకొచ్చి రెండడుగులు వేసేసరికి ముకుందం ఇల్లు. ఆ ఇంటి ముందు పూలచెట్టు. వెన్నెలలా రాలుతున్న పువ్వులు. ఉదయం ఆరయ్యేసరికి ఆ చెట్టు క్రింద తెల్లటి మేఘాలు పరుచుకున్నట్లు పూలవరుస ఆ పూలను ఏరుతూ ముకందం. అతడు ఏరిన పువ్వుల్ని మాలగా కట్టే అతడి కూతురు.

ముకుందమే "గుడ్‌మార్నింగ్ సార్" అంటూ సుప్రభాతం చెపుతాడు ఇద్దరం బయలుదేరతాం. అతడే మాట్లాడతాడు ప్రవాహంలా. ఆ రోడ్డు దాటేసరికి మరి కొంత మంది మిత్రులు ఎదురవుతారు. అందరూ నాలా శ్రోతలే!

ఈనా దినచర్య ఆ వూరొచ్చిన మూడు నెలల నించీ నేను అమలు పరుస్తున్నదే. మరి ఈ రోజు ముకుందం చెట్టు కింద లేదేమిటి?

గబగబా నడుస్తూ ముకుందం ఇంటి లోపలకు దృష్టి సారించేను. మంచం మీద పడుకున్న ముకుందం. "ఆయనకు వంట్లో బాగోలేదండీ!" అంటూ ముకుందం గారి భార్య మాటలు విని గబగబా బైటకొచ్చాను.

ముకుందంతో నా పరిచయం సరిగ్గా మూడు నెలల క్రితం జరిగింది.

ఆ ఊళ్ళోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో మొదటి పోస్టింగ్. ఊరికీ, ఉద్యోగానికీ అపరిచితుణ్ణి. తడబడుతున్న అడుగులతో ఆఫీసులోకి ప్రవేశించాను. మేనేజర్ కేబిన్ తలుపు మీద మేనేజర్ ఆన్ టూర్ అనే బోర్డు. ఇంతలో ఒకాయన వచ్చి నిలుచున్నాడు. సన్నగా, పొడుగ్గా నవ్వే కళ్ళు, చెంపల క్రింద మెరుస్తున్న జుట్టు, పొడుగు చేతుల చొక్కా వయసు యాభై లోపు వుంటుందేమో! నేను మీ ఆత్మీయుణ్ణి సుమా అన్నట్టుగా వున్నాయి అతడి చూపులు.

"నా పేరు శ్రీపతి. ఈ ఆఫీసులో పబ్లిక్ రిలేషన్ ఆఫీసరుగా చేరడానికి వచ్చాను." అన్నాను.

"మా నూతన సహచరుడికి స్వాగతం. నా పేరు ముకుందం. ఆఫీసు సూపరింటెండెంట్‌ని. రెండు నెలల క్రితం వచ్చాను. మీ బాధ్యతలు కూడా నేను నిర్వహిస్తున్నాను. అదే! కోపాన్ని మితంగా వాడుకుంటూ నవ్వులు విరివిగా వెదజల్లే పిఆర్ఓ ఉద్యోగం..." అన్నాడు నవ్వుతూ నేనూ నవ్వేసాను అతని స్పాంటేనియస్ హ్యూమర్‌కు. ఆ తర్వాత తనే నన్ను ఆఫీసులో అందరికీ పరిచయం చేశాడు. పరిచయాలైన తర్వాత నన్ను దగ్గరకు పిలిచి చెప్పాడు.

"ఆఫీసులో చాలామంది వర్కోహాలికులు, వారితో గొడవలేదు. కొంతమంది హాలికులు, అంటే ఆఫీసుకు తరచుగా శెలవు పెట్టి, పెట్టకుండా వ్యవసాయం చేసుకునే రైతు సోదరులు. ఈ వర్కోహాలికులు, హాలికుల మధ్య నేనొక్కడినే ఆల్కాహాలిక్.. అన్నాడు.

హిపోక్రసీ లేకుండా తన బలహీనత గురించి చెప్పిన ముకుందం వెంటనే నాకు సన్నిహితుడయ్యాడు. నా వయసు మీద రెట్టింపు వయసు వున్నప్పటికీ ఆయన ఇంటి పక్క రూము తీసుకోవడంతో మా స్నేహం మరింత గట్టిపడింది.

అలా ముకుందం ఆలోచనలతోనే నా మార్నింగ్ వాక్ గడిచింది.

ఆ రోజు ఆఫీసుకు వెళ్ళిన అరగంటకు ఇంటి నించి ఫోన్ తాతయ్యకు హార్ట్ ఎటాక్ అని. వెంటనే బయలు దేరాను.

* * * * *

పదిహేను రోజుల తర్వాత తిరుగు ప్రయాణం. ట్రెయిన్ దిగి ప్లాట్‌ఫారమ్మీద నడుస్తున్నాను. అందరూ హడావుడిగా పరిగెడుతున్నారు. ట్రెయిన్ ఎక్కేవారు, దిగేవారూ కూడా పరుగే.. పుట్టినప్పటినించీ చావడం కోసమే పరుగు పెడుతున్నట్టు? ఛఛ... ఇంత ఉదయం పూటే ఈ చావుల ఊసెందుకు? తాతయ్య చనిపోవడంతో శ్మశాన వైరాగ్యానికి గురయ్యానా! ఆలోచనలతోనే ఆటో ఎక్కాను.

ఇంటికి చేరుకుని యథాలాపంగా ఆ చెట్టు క్రింద చూశాను ఏదో వెలితి. రెండడుగులు వేసి ముకుందం ఇంటి ముందునుంచుని పిలిచాను. ముకుందం కూతురు బైటకొచ్చింది. మీరు వెళ్ళిన తర్వాత రోజే నాన్నగారిని ఆసుపత్రిలో చేర్చాము. జ్వరం తగ్గలేదు. అందామె దిగులుగా. ఇంతకీ ఏం జ్వరం? మలేరియానా? టైఫాయిడా అన్నాను. "ఏమో తెలీదంకుల్" అంటూ ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది ప్రయాణపు బడలిక పావుగంట షవర్ క్రింద నించోవడంతో తీరింది. బట్టలు వేసుకుని ఇంట్లోంచి బైటకొచ్చాను. రోడ్డు మీద రామనాథం కనిపించాడు. అతను మా ఆఫీసు వాడే. వెంటనే రామనాథాన్ని కేకేసి పిలిచి, "ముకుందం ఆసుపత్రిలో ఉన్నాడు కదా? ఏ ఆసుపత్రి? మీరూ వస్తారా చూసొద్దాం...?" అన్నాను.

"ఈ వీధి చివర మెయిన్‌రోడ్డు మీద వుండే ఆసుపత్రిలో మీరు వెళ్ళిరండి. కొంచెం దూరం నుంచి చూసిరండి, నాకెందుకు న్యూసెన్సు" అంటూ వెళ్ళిపోయాడు.

నా మెదడులో విస్ఫోటనం..

ఏమిటీ అతడి అనుచిత వ్యాఖ్యలు..

నాలో అర్థంకాని భయం.

ఆసుపత్రి చేరే సరికి గేటు ముందు ముకుందం భార్య, కొడుకు.

"ఎలా ఉన్నారు ముకుందం?"

నా మాటలకు సమాధానం చెప్పకుండా వారు మౌనంగా వెళ్లిపోయారు.

నా మనసులో దారపు పోగుల్లా చిక్కుకుంటున్న ఆలోచనల ముడులు. తడబడుతున్న అడుగులతో రిసెప్షన్‌కు వెళ్ళి ముకుందం వివరాలు అడిగి అతడిని వుంచిన రూముకేసి నడిచాను.

తలుపు తెరిచే వుంది. నీట్‌గా సర్దివున్న బెడ్ మీద పరిచిన తెల్లటి దుప్పటి ఆకుపచ్చని పెయింటు చేసిన గది గోడలు. బెడ్ మీద మాత్రం ముకుందం లేదు...! ఏమయినట్టు?

రెండుసార్లు పిలిచాను. ఏ అలికిడి లేదు. రెసిడెంట్ డాక్టరుగారి రూముకు చేరుకున్నాను.

"సార్ రూమ్ నెంబర్ 201 లో పేషంటు లేడు. డిశ్చార్జి చేసేసారా...?" అనడిగాను.

డాక్టరు నావంక జాలిగా చూసి, ఒక నిట్టూర్పు విడిచి, "ఆయన ఆసుప్రతికి పడుకోవడానికి మాత్రమే వస్తున్నారు పగలంతా ఎక్కడో తిరిగి తాగిన మైకంలో రాత్రికి రూముకు చేరుకుంటున్నారు. అందుకే ఆయనను ఇవాళ డిశ్చార్జి చేసేస్తున్నాం." అన్నాడు.

"అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన వ్యక్తి అలా వెళ్ళిపోతుంటే ఏం చేస్తున్నారు" అన్నాను కోపంగా

"మేం చెప్పినా ఇంట్లో వాళ్ళు చెప్పినా ఆయన వినడం లేదు. అయినా ఆయన మామూలు రోగి కాదు కదా.." అన్నాడాయన.

"అంటే ..?"

హి ఈజ్ ఎయిడ్స్ పేషంట్ అండర్ అబ్జర్వేషన్.

నేను షాక్ తిన్నాను ఆయన మాటలకు.

ఆయన వ్యాధి నిరోధక శక్తి క్షీణించింది. ఎలీసా టెస్ట్ పాజిటివ్. వెస్టర్న్ బ్లాస్ట్ చేయించాము. అదీ పాజిటివ్. ఇపుడాయనకు కావలసింది ఆత్మీయుల, సన్నిహితుల ఓదార్పు. మా కౌన్సెలింగ్ పూర్తయింది. ఇక మీ పని వుంది."

ఆయన మాటలు వింటుంటే నా మనసులో ఏదో తెలీని ఆందోళన.

"ఆయన ఎక్కడో తాగి పడిపోయి వుంటాడు. ఆసుపత్రికి తీసుకురండి." డాక్టరు గారి ముక్తాయింపు మాటలతో ఆసుపత్రి నించి బైటకు కదిలాను.

ఆ ఉదయం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. నలువైపులా చూస్తున్నాను. ఎక్కడని ఆయన్ని వెతకాలి?

ఇంత ఉదయం పూట తాగడానికి వెళతాడా? ఆలోచిస్తూనే అన్నివైపులా చూస్తూ నడుస్తున్నాను. షాపులు ఇంకా తెరవలేదు. నా రూముకు వెళ్ళే సందు మొదట్లో ఒక బార్ తెరిచివుండి. రెండడుగులు వేసి తలతిప్పాను. లోపల టేబుల్‌కు ఎదురుగా కుర్చీ మీద కూర్చున్న వ్యక్తి! నాకు కావలసిన ముకుందం. వేగంగా లోపలకు నడిచాను. అతని ముఖం ఉబ్బి ఉంది. కళ్ళ కింద నిద్రపోని ఆనవాళ్ళు మౌనంగా గ్లాసులోని ద్రవాన్ని తాగుతున్నాడు. ఆయనతో ఏం మాట్లాడాలో తెలీక తలొంచుకున్నాను.

రెండు నిముషాల తర్వాత అతడి ముఖంలో ఏదో చలనం...

"సార్. మీరెందుకు తలొంచుకుంటారు? తలొంచుకోవలసింది నేను" అతడి నోట్లోంచి ముద్దగా వస్తున్న మాటలు.

"బాధపడకండి ఆరోగ్యం బాగోలేదు కదా ఆసుపత్రిలో వుండడం క్షేమం. పదండి" అన్నాను.

ముకుందం కళ్ళ నించి జలజలా కన్నీళ్ళు. క్రమేపీ అవి ఉధృతంగా మారాయి.

"సార్, అయిపోయింది, ముకుందం బతుకు పుస్తకంలో ఆఖరి పేజీ. ముకుందం ప్రేమించే వెన్నెల, పువ్వులు, పక్షులు, పసిపాపలు అన్నీ వుంటాయి. కానీ ముకుందం మాత్రం వుండడు" అలా ఏడుస్తూనే ముకుందం టేబుల్ మీద తల వాల్చాడు.

ముకుందాన్ని ఆటోలో ఆసుపత్రికి చేర్చాను.

* * * * *

వారం రోజుల తర్వాత, ఆఫీసులో పని చేసుకుంటున్నాను.

"సార్?" అనే పిలుపు. తల స్నానం చేసి జుట్టు, ముఖం మీద విభూది రేకలతో ఎదురుగా ముకుందం.

"బావుందండి మిమ్మల్ని ఇలా చూడడం...?" అన్నాను సంతోషంగా.

"ఉదయమే గుళ్ళో పూజ చేయించి ప్రసాదం తీసుకొచ్చాను అందరికీ పంచుదామని" అంటూ తను తెచ్చి ప్లాస్టిక్ సంచిలోని పులిహోర పొట్లం నాకిచ్చాడు. నేను "థేంక్స్" చెప్పి తీసుకున్నాను. అతను ప్రసాదం పంచుతుంటే కొంతమంది వద్దన్నారు. మిగతావాళ్ళు అయిష్టంగా తీసుకున్నారు.

లంచ్ అవర్లో మెస్సులో భోంచేసి ఆఫీసు మెట్లెక్కుతూ స్టెయిర్‌కేస్ పక్కనున్న డస్ట్‌బిన్ కేసి యథాలాపంగా చూసాను. దాని నిండా ముకుందం పంచిన ప్రసాదం పొట్లాలు.

తల తిప్పేసరికి కనుకొనల నించి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ నా వెనుక

నించున్న ముకుందం.

"కూల్ డౌన్ ముకుందం" అంటూ పైకొచ్చేశాను.

* * * * *

కళ్ళు తెరవలేకపోతున్నాను. మంచం మీద నించి లేవాలంటే బద్ధకం కాదు భయం. ఆఫీసు బయలుదేరగానే అలజడి మొదలవుతుంది. ఆఫీసులో ఎయిడ్స్ వ్యాధి గురించి డాక్టర్లతో సెమినార్ ఏర్పాటు చేసాను. అందరికీ కరపత్రాలు పంచాను. అంతా చదువుకున్నవారే. అయినా లాభంలేదు. ముకుందం మూలంగా అస్థిత్వం కోల్పోయిన ఆఫీసు. బలవంతంగా లేచాను. తయారై అరగంటలో ఆఫీసుకు చేరుకున్నాను. నా సీటు ముందున్న ఇద్దరు కొలీగ్స్ మాట్లాడుకుంటున్నారు.

"వరేయ్ నీకు ఎ,బి,సి,డి లు వచ్చా....?"

"వచ్చు..."

"అయితే చెప్పు? ఎ,బి,సి,డి,ఇ,ఎఫ్,జి,హెచ్,ఐ..."

"ఆపు దాని తర్వాత అక్షరం 'వి' రా కన్నా"

ఆ ఇద్దరి సంభాషణ వింటున్న ముకుందం ముఖాన్ని చూడడానికి నాకు బాధ కలిగింది. అరగంట తర్వాత స్టోర్ కీపర్ భానుమూర్తి వచ్చి "సార్... టీ తాగడానికి బైటకెళ్తున్నాం..." అన్నాడు.

"సరే....!" అన్నాను. రెండు నిముషాల తర్వాత డ్రాఫ్టమెన్ సుబ్బారావు, ఇంకో గుమాస్తా యాదగిరి "సార్ చాయ్" అన్నారు. ఆ తర్వాత మరో ఐదుగురు పర్మిషన్ అడిగే సరికి నాకు ఆశ్చర్యం... "ఏమిటీ బైటకెళ్ళి పోతున్నారు? మన ఆఫీసుకు ఛాయ్ వస్తుంది కదా!" అన్నాను.

నా ప్రశ్నకు సమాధానంగా ఒక కొలీగ్ నవ్వుతూ "లేదండీ ఆఫీసులో ఛాయ్

తాగడం మానేసాం. ముకుందం ఏ కప్పులో తాగుతాడో తెలీదు కదా...!"

ఆ మాటలకు తలెత్తి చూసిన ముకుందం వెంటనే తలొంచుకున్నాడు.

నాకు మతిపోయింది. ఇది అజ్ఞానమా లేక అమాయకత్వమా.. ఫూలిష్‌నెస్ కమ్స్ అవుటాఫ్ ఇన్నోసెన్స్.

ఇంతలో రామనాథం నా దగ్గరకొచ్చి "సార్ ముకుందం గుండుసూదితో పళ్ళు క్లీన్ చేసుకుంటాడు, పొరపాటున ఆ సూది మనం గుచ్చుకుంటే ప్రమాదమా?" ఈ మాటలు అతను మెల్లగా అనలేదు, గట్టిగానే అన్నాడు. అంతే! ముకుందం వేగంగా సీట్లోంచి లేచాడు. నా వంక చూడకుండానే "సార్ ఇవాళ నాకు లీవ్" అంటూ గబగబా బైటకు నడిచాడు.

రెండు రోజుల తర్వాత...

ఆఫీసుకు లేటయింది. లోపలికి వెళ్ళే సరికి ముకుందం తలొంచుకుని పని చేసుకుంటూ కనిపించాడు. నన్నుచూసి తలెత్తి "నమస్తే సార్" అంటూ పలకరింపుగా నవ్వాడు. ఆ నవ్వులో జీవం లేదు. మా ఆఫీసు సహచరులంతా మేనేజరుగారి కేబిన్ నుంచి బైటకొస్తున్నారు. ఏదో ఐఆర్ ప్రోబ్లమ్‌లా వుంది అనుకుంటూ లోపల కెళ్ళాను.

మా మేనేజర్‌గారు తల పట్టుకు కూర్చున్నారు. నేను ఆయన్ని ప్రశ్నించక మునుపే "ముకుందం అనారోగ్యం గురించి అందరికీ తెలిసిపోయింది. మన చుట్టు పక్కల బ్రాంచీలకు ఈ విషయం పాకింది. మనవాళ్ళు మాత్రం ఆయనను ఆఫీసుకు రానివ్వకండి, అటెండెన్సు రిజిష్టరు జీతము నెలకోసారి ఇంటికే పంపండి అంటున్నారు" అన్నాడు.

"ఏంటండీ, ఆ జబ్బు గల వ్యక్తి పక్కనున్నా అంటుకోదనీ, వేరే కారణాల వలన వస్తుందనీ, అందరికీ తెలిసిన విషయమే. అయినా ఏమిటీ మూర్ఖత్వం"

అన్నాను.

"లేదండీ.. ఆయనొస్తే ఆఫీసులో అంతా మాస్ లీవ్ పెడతారట. పోనీ బదిలీ అయినా చెయ్యమంటున్నారు. ఎక్కడకు వెళ్ళినా అదే సమస్య కదా ఏంచెయ్యాలో అర్థం కావడం లేదు.."

నేను వెంటనే "ఆయన ఆఫీసుకు వచ్చి పని చేస్తానంటే ఆపే శక్తి ఎవరికీ లేదు." మేనేజర్‌గారికి కోపంగా, చెప్పి బైటకొచ్చి, చూసేసరికి ముకుందం సీట్లో లేడు. నా టేబుల్ మీద ముకుందం వుంచిన లీవ్ లెటర్ ఫేన్ గాలికి రెపరెపలాడుతూ కనిపించింది.

* * * * *

చెవులు చిల్లులు పడేలా సముద్రపు హెూరు. పూలచెట్టు చుట్టూ అగ్ని శిఖలు. కాలుతూ రాలుతున్న పువ్వులు. ఆచెట్టు కింద చీకటి పరిచినట్టు....

ఇంతలో సన్నగా ఏడుపు... లీలగా ఎక్కడి నించో వస్తున్న ఆర్తనాదాలు.

గభాలున కళ్ళు తెరిచాను. కిటికీలోంచి చూసాను. యధావిధిగా తెల్లని పూలను రాలుస్తూ ఆ చెట్టు. ముకుందం ఇంటి ముందు ఆ కాలనీ వాళ్ళంతా గుమికూడారు. గబగబా ఇంట్లోంచి బైటకు పరిగెత్తాను. ఆసుపత్రిలో నేను కలిసి మాట్లాడిన డాక్టరుగారు ముకుందం ఇంట్లోంచి బైటకొస్తూ కనిపించారు.

"సార్.... ఏమయింది!" అన్నాను.

"హి ఈజ్ డెడ్... నిద్దట్లోనేమో! మాసివ్ అయ్యుండొచ్చు. మరీ ఇంత తొందరగానా... నిన్నంతా తాగుతూనే వున్నాడుట... రాత్రి పడుకునే వరకూ ఆపలేదట. సమ్‌థింగ్ రాంగ్" ఆయన చెపుతూనే కారెక్కి వెళ్ళిపోయారు. ముకుందం మాకిక లేడనే చేదు నిజాన్ని మిగిల్చి.

ఆపరేషన్ చేసిన 'ఆబ్సెస్'లా మనసుకు గాయం. నిన్న ఆఫీసులో మేనేజర్గారి రూములో ఆయనతో జరిపిన సంభాషణ గుర్తుకొచ్చింది.

ఆయన ఏమన్నాడు? "ముకుందం గారిని బదిలీ చెయ్యాలి... ఒక వేళ బదిలీ చేస్తే అక్కడా సమస్యే"

మరిపుడేమయింది? ఎవరికీ సమస్య కాకూడదని కాబోలు పై లోకాలకు బదిలీ అయిపోయాడు ముకుందం.

నాలో అంతర్గతంగా ఆవేదన. కళ్ళనించి నీళ్ళు . నిన్నటి వరకూ మాతో కలిసి తిరిగిన సహచరుడు ఇక లేడు! ఆ ఆలోచనే దుఃఖం కలిగిస్తోంది. ముకుందం అందరి లాంటివాడు కాదు. ఒక చైతన్యం... ఒక ఆహ్లాదం... ఒక నిరంతర ప్రవాహం.. అంతే కాదు నిశ్శబ్దంలోనూ అతడు ఒక సందడి.

ఎవరో అంటున్నారు. "నిద్దట్లోనే చనిపోయాడట! సునాయాస మరణం. అనాయాస జీవితం అదృష్ట వంతుడు.."

ఔను అదృష్టవంతుడే సూటిపోటి మాటల లోకం నించి శెలవు పుచ్చుకున్న ధన్యుడు.

నిన్న ఆఫీసు లోంచి వెళ్ళిపోతూ "లీవ్ సార్" అన్నాడు. అంటే ఇలా శాశ్వత శెలవు తీసుకున్నాడా?"

నన్ను కాటికి పంపాల్సినవాడివి నా చేతుల్లోనే పోయావా తండ్రీ...

ముసలి తల్లి రోదనకయినా ముకుదం బతికితే బాగుండును..

నా మనసులో అలజడి. డాక్టరేమన్నాడు సమ్‌థింగ్ రాంగ్!

ముకుందం మంచం కింద చూసాను తాగేసిన ఖాళీ సీసాలు. ఇంకా తగరం

మాత్రలు. అవి బైటకు లాగేను. వాటిల్లో మాత్రల పేర్లు చదివేసరికి నాలో ముచ్చెమటలు ఆ మాత్రలు నిద్రపట్టడానికి వేసుకునేవి, ముకుందాన్ని శాశ్వత నిద్రకు గురిచేసినవి. ఆ మాత్రల ఆనవాళ్ళను కిటికీలోంచి దూరంగా విసిరేసాను. తన మరణాన్ని సహజంగా చిత్రించుకుని కుటుంబానికి, సమాజానికి కళంకం తేకుండా వెళ్ళిపోయిన నా మిత్రుడు హాయిగా నిద్రపోతున్నాడు.

మధ్యాహ్నం కల్లా ఏర్పాటు పూర్తయినాయి. ముస్తాబు చేయబడ్డ పూలగుత్తిలా ముకుందం ఆ పూల చెట్టు క్రింద పూలకు ఏరుకొచ్చాను. అతని శరీరం మీద చల్లాను.

మనిషిని చంపితే శిక్ష వుంది, మరి మనసును చంపితే...!

ముకుందం నా చెవిలో గుసగుస మాట్లాడినట్టనిపించి గుండెలు బరువెక్కాయి.

– రచన మాసపత్రిక సెప్టెంబరు, 2006

* * * * *